సాక్షి
హనుమకొండ

శనివారం | 30 | సెప్టెంబర్ | 2023



మో'డల్' మార్కెట్

వరంగల్ లక్ష్మీపురంలోని కూరగాయల మార్కెట్‌లో మౌలిక వసతులు లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.

- 8లో▸



అర్చకులకు 'ఆగమ'పై శిక్షణ

రేపటి నుంచి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో డీడీఎన్ అర్చకులకు ఆగమాలపై శిక్షణ ఇస్తారని గంగు ఉపేంద్రశర్మ తెలిపారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
31⁰/24⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎస్‌ఏల బదిలీలకు వెబ్ ఆప్షన్లు షురూ

విద్యారణ్యపురి: స్కూల్ అసిస్టెంట్ల బదిలీలకు సంబంధించి దరఖాస్తులు చేసుకున్న వారికి శుక్రవారం వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభమైంది. దీంతో స్కూల్ అసిస్టెంట్లు ఆప్షన్లు ఇచ్చుకుంటున్నారు. ఈనెల 30న కూడా ఇందుకు అవకాశం ఉంది. అక్టోబర్ 1న ఎడిట్ ఆప్షన్లకు అవకాశం ఉంది. అనంతరం ఆయా స్కూల్ అసిస్టెంట్లకు బదిలీ ఉత్తర్వులు ఇవ్వనున్నారు. హనుమకొండ జిల్లాలో 550 మందికి పైగా బదిలీలకు దరఖాస్తులు చేసుకోగా.. 250కిపైగా.. ఎస్‌ఏల వేకెన్సీలు ఉన్నాయి. ఎస్‌ఏల బదిలీల ప్రక్రియ ముగిశాక.. ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతుల ప్రక్రియ జరగాల్సి ఉంటుంది.

నేడు డయల్ యువర్ డీఎం

హన్మకొండ: ప్రయాణికుల సమస్యలు, సూచనలు, సలహాలు తెలుసుకునేందుకు శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ హనుమకొండ డిపో మేనేజర్ బి.ధరంసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హనుమకొండ డిపో నుంచి నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. జమ్మికుంట, వేలేరు, ఐనవోలు, పర్వతగిరి, సంగెం, ఖిలావరంగల్, హనుమకొండ, హసన్‌పర్తి, కమలాపూర్, వరంగల్, కాజీపేట మండలాల పరిధి ప్రయాణికులు 99592 26040 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలు, సలహాలు, సూచనలు అందించాలని ఆయన కోరారు.

జాతీయ సెమినార్‌ను జయప్రదం చేయండి

వరంగల్ లీగల్: అక్టోబర్ 1న హైదరాబాద్‌లోని సుందరయ్య కళా నిలయంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రాజ్యాంగంపై నిర్వహించే జాతీయ సెమినార్‌కు పెద్ద ఎత్తున న్యాయవాదులు హాజరై జయప్రదం చేయాలని ఐలు రాష్ట్ర కోశాధికారి వేణుగోపాల్‌రావు పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ.. రాజ్యాంగంపై న్యాయాన్ని రక్షించే న్యాయవాదులకు క్షుణ్ణంగా అవగాహన ఉండాలన్నారు. ఈసదస్సులో పలువురు న్యాయమూర్తులు, మాజీ న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొని వారి సందేశాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు అంబరీశ్, సత్యనారాయణరెడ్డి, రమ, వీరేశ్, మల్లేశ్, రాజేంద్రప్రసాద్, సాయిని నరేందర్, రాచకొండ ప్రవీణ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

టెట్‌ను మినహాయిస్తూ పదోన్నతులివ్వాలి



విద్యారణ్యపురి: టెట్‌ను మినహాయిస్తూ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండలో నిర్వహించిన టీపీటీఎఫ్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. టెట్‌ను తప్పనిసరి చేస్తూ 2010లో ఎన్‌సీటీఈ నిబంధన విధించినట్లు పేర్కొన్నారు. 2010కి ముందు నియామకమై సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. కాగా.. టెట్ అర్హతతో సంబంధం లేకుండానే.. 2012, 2015లో పదోన్నతులు కల్పించారని గుర్తు చేశారు. సీనియార్టీ జాబితాలో తప్పులను సరి చేయాలని ఆయన విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. సమావేశంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్, ఉపాధ్యాయ దర్శిని సంపాదకులు వి.అజయ్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు జె.స్వామి, పూర్వ సంపాదకులు బైరి స్వామి, బాధ్యులు అశోక్, దినేశ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

పరశురాములుకు నేషనల్ అవార్డు ప్రదానం



కేయూ క్యాంపస్: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ గుండె పరశురాములు శుక్రవారం న్యూఢిల్లీలోని భారత రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా నేషనల్ అవార్డు అందుకున్నారు. తెలంగాణ నుంచి ముగ్గురు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు అవార్డు అందుకోగా.. అందులో పరశురాములు ఒకరు. ఆయన వెంట కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.వినోద్‌రావు పాల్గొన్నారు.

మరణ దండన

బాలుడి కిడ్నాప్, హత్య కేసులో మానుకోట కోర్టు సంచలన తీర్పు

- ఉరిశిక్షతోపాటు రూ.33 వేల జరిమానా విధించిన జడ్జి చంద్రశేఖర ప్రసాద్
- బాలుడిని చంపిన తర్వాత డబ్బులు డిమాండ్ చేసిన నేరస్తుడు సాగర్
- ఐటీ కోర్ సాయంతో సాంకేతిక ఆధారాల సేకరణ
- 2సంవత్సరాల 11 నెలల్లో వెలువడిన తీర్పు
- బాణసంచా పేల్చిన కుటుంబ సభ్యులు
- న్యాయం గెలిచిందని న్యాయదేవత, పోలీస్ లోగోకు క్షీరాభిషేకం



హత్యకు గురైన బాలుడు దీక్షిత్ (ఫైల్)



మంద సాగర్

సాక్షి, మహబూబాబాద్/మహబూబాబాద్ రూరల్/వరంగల్ లీగల్: మానుకోట జిల్లా న్యాయస్థానం చరిత్రలో శుక్రవారం సంచలన తీర్పు వెలువడింది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన జిల్లాకు చెందిన కుసుమ దీక్షిత్‌రెడ్డి(9) కిడ్నాప్, హత్య ఘటనలో 2 సంవత్సరాల 11 నెలల్లో తీర్పు వచ్చింది. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో ముందుకు సాగిన కేసు అనేక పరిణామాలు, విచారణ, సాక్ష్యుల వాంగ్మూలం ఇలా ప్రతీ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖర ప్రసాద్.. నిందితుడు మంద సాగర్‌ను దోషిగా నిర్ధారిస్తూ మరణ శిక్ష (ఉరిశిక్ష) విధిస్తూ తీర్పు ఇచ్చారు. కాగా.. స్వాతంత్ర్యానికి ముందు నుంచి కొనసాగుతున్న మానుకోట కోర్టులో.. ఉరి (మరణ శిక్ష) విధించడం ఇదే తొలిసారి. కేసు తుది వాయిదా, తీర్పు వెలువరించే సమయంలో కోర్టు హాల్ కిక్కిరిసింది. బాలుడి బంధువులు కోర్టు వద్దకు వచ్చారు. తీర్పు చెప్పిన వెంటనే అక్కడున్న వారు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. కాగా, తక్కువ కాలంలో కేసును ఛేదించిన పోలీసులను, న్యాయవాదులను న్యాయమూర్తి అభినందించారు.

న్యాయవాదులకు అభినందనల వెల్లువ

కేసు పక్కదారి పట్టకుండా, ముద్దాయికి శిక్ష పడేలా వాదించిన న్యాయవాదులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర ప్రసాద్ అభినందించారు. ఇందులో డీడీటీపీ సత్యనారాయణ, పీపీ చిలకమారి వెంకటేశ్వర్లు, పోక్సో కోర్టు పీపీ కీసర పద్మాకర్‌రెడ్డి సేవలను ప్రశంసించారు.

కేసులో పాలుపంచుకున్న వారికి అభినందనలు

దీక్షిత్‌రెడ్డి హత్య కేసును ఛేదించడంలో భాగస్వాములైన పోలీసులను ఎస్పీ అభినందించారు. ఇందులో అప్పటి డీఎస్పీ నరేశ్‌కుమార్, సీఐలు రవికుమార్, సతీశ్, ఎస్సైలు అరుణ్‌కుమార్, వెంకటాచారి, గోపీ, సీడీఓలు సంపత్‌రెడ్డి, మోహన్, లింగయ్య, పోలీసు సిబ్బంది శ్రీకాంత్, వెంకటరమణ, కుమారస్వామి, ఉదయభాస్కర్‌ను అభినందించారు.

న్యాయవ్యవస్థ, పోలీస్ లోగోకు క్షీరాభిషేకం

తన కుమారుడి హత్య కేసులో నేరస్తుడికి శిక్ష పడినందుకు బాలుడి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కోర్టు ఎదుట న్యాయ వ్యవస్థ లోగో, పోలీస్ లోగోల ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. వాటికి క్షీరాభిషేకం చేశారు. అదేవిధంగా బాణసంచా పేల్చారు.



ఘటన ఎప్పుడు జరిగింది	18-10-2020
వెలుగులోకి వచ్చింది కేసు	21-10-2020
నిందితుడి అరెస్ట్	22-10-2020
చార్జ్‌షీట్ దాఖలు, విచారణ	28-06-2021
విచారణ ముగింపు, తీర్పు	29-09-2023
సాక్షులు	48 మందికిగాను కోర్టుకు 43

సెక్షన్లు.. శిక్షలు ఇలా :

306 - 7ఏళ్లజైలు రూ.2వేల జరిమానా, 201 - మూడేళ్ల జైలు, రూ.1000, 364(ఏ) - మరణ శిక్ష, రూ.10వేలు, 361- ఉరి, రూ.10వేలు, 302 - మరణ శిక్ష, రూ.10వేల జరిమానా

ఉరిశిక్ష పడినందుకు సంతోషంగా ఉంది..



మానుకోట చరిత్రలో ఈ తీర్పు సంచలనం. ఇప్పటివరకు ఇంత పెద్ద శిక్ష పడలేదు. బాలుడిని హత్యచేసిన వ్యక్తికి శిక్ష పడాల్సిందే. ఇందులో ప్రభుత్వం తరఫున వాదించే అవకాశం వచ్చినందుకు గర్వంగా ఉంది. చట్టం ముందు ఎవరైనా సమానులే.. నేరం చేసిన వారు శిక్ష అనుభవించాల్సిందే.

\- చిలకమారి వెంకటేశ్వర్లు, పీపీ



శిక్ష ఖరారైన అనంతరం మంద సాగర్‌ను చంచల్‌గూడ జైలుకు తరలిస్తున్న పోలీసులు

పోలీస్‌శాఖ చాలెంజ్‌గా తీసుకుంది



చిన్న పిల్లవాడు దీక్షిత్‌రెడ్డి ఘోరంగా హత్యకు గురయ్యాడు. ఈ ఘటన నన్ను కలిచి వేసింది. కేసును ఛేదించేందుకు పోలీస్‌శాఖ చాలెంజ్‌గా తీసుకుంది. 650 పేజీల చార్జ్‌షీట్ కోర్టులో సమర్పించా. నిందితుడికి శిక్ష పడినందుకు సంతోషంగా ఉంది. కేసును ఛేదించడంలో నేను భాగస్వామినైనందుకు గర్వంగా ఉంది.

\- రవికుమార్, సీఐ

మరోసారి ఇలాంటి ఘటన జరగకుండా తీర్పు



మా కుమారుడిని చంపిన సాగర్‌కు మరణ శిక్ష విధించినందుకు సంతోషంగా ఉంది. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు ఈ తీర్పు దోహదపడుతుంది. మేము ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా న్యాయం లభించింది. సహకరించిన న్యాయ, పోలీసు వ్యవస్థకు రుణపడి ఉంటాం.

\- రంజిత్‌రెడ్డి, వసంత బాలుడి తల్లిదండ్రులు

చంపిన తరువాత డబ్బులు డిమాండ్.



మాట్లాడుతున్న ఎస్పీ చంద్రమోహన్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖర ప్రసాద్ వెలువరించిన తీర్పు వివరాలను ఎస్పీ చంద్రమోహన్ పత్రికా విలేకరుల సమావేశంలో వివరించారు. మహబూబాబాద్ మండలం శనిగపురం గ్రామానికి చెందిన మంద సాగర్ మూడుకొట్ల సెంటర్ వద్ద ఆటోమెకానిక్‌గా ఉంటూ.. ఆటోమొబైల్ షాపు నిర్వహిస్తూ ఉండేవాడు. సెల్‌ఫోన్‌లోని యాప్‌లు డౌన్‌లోడ్ చేయడం, కొత్త కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకొని చాటింగ్ చేసేవాడు. తన కుటుంబంలోని ఇతర సభ్యులు ఆర్థికంగా ఉన్నతితో ఉండడంతో డబ్బులు సంపాదించాలనే దురాలోచన కలిగింది. తన గ్రామానికి చెందిన కుసుమ రంజిత్ రెడ్డి మహబూబాబాద్ కృష్ణ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఇతను ఆర్థికంగా బాగా ఉండడంతో అతడి కుమారుడిని కిడ్నాప్ చేస్తే డబ్బులు వస్తాయని భావించాడు. ఈనేపథ్యంలోనే 2020 అక్టోబర్ 18న రంజిత్ రెడ్డి కుమారుడు దీక్షిత్‌రెడ్డిని తన మోటారు సైకిల్‌పై ఎక్కించుకున్నాడు. నేరుగా తాళ్లపూసపల్లి రోడ్డులోని దానమయ్య గుట్టపైకి తీసుకెళ్లి నిద్రమాత్రలు కలిపిన కూల్ డ్రింక్ తాగించి టీ-షర్ట్‌ను మెడకు చుట్టి గొంతు నులిమి హత్య చేశాడు. మృతదేహాన్ని కాల్చివేశాడు. అదేవిధంగా డింగ్‌టోన్ యాప్ ద్వారా తనెవరో తెలియకుండా కాల్ చేసి రంజిత్‌రెడ్డి కుటుంబ సభ్యులను రూ.45 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లేకపోతే కుమారుడిని చంపుతామని బెదిరించాడు. ఇలా పలుమార్లు ఫోన్లు చేయడం.. బెదిరించడంతో చివరికి పోలీసులను ఆశ్రయించారు. మూడు రోజులైనా బాలుడి కిడ్నాప్ తేలకపోవడంతో ఈకేసు పోలీసులకు సవాల్‌గా మారింది.

రంగంలోకి దిగిన ఐటీకోర్

సాగర్ చేసిన ఫోన్ కాల్స్‌ను ఛేదించేందుకు పోలీసులు ఐటీ కోర్ విభాగాన్ని దింపారు. రంగంలోకి దిగిన ఐటీ కోర్ పోలీసు విభాగానికి చెందిన ప్రశాంత్, కిషోర్ కుమార్.. సాగర్ మాట్లాడిన కాల్స్‌ను పరిశీలించారు. ప్రత్యేక డింగ్‌టోన్ యాప్ ద్వారా కాల్ చేసినట్లు గుర్తించి లొకేషన్‌ను చూశారు. ఫోన్లు చేసేది సాగర్‌గా గుర్తించి 2020 అక్టోబర్ 22న అదుపులోకి తీసుకున్నారు. పలు కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. అనంతరం కేసు దర్యాప్తులో పలువురు సాక్షులను విచారించారు. ఘటనాస్థలి వద్ద లభించిన ఆధారాలను సేకరించి కోర్టుకు సమర్పించారు. కోర్టులో ఇరువర్గాల వాదనలు విన్న జడ్జి.. సాగర్‌పై నేరం రుజువు అయ్యిందని, మరణ శిక్షతోపాటు రూ.33 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కాగా.. పోలీసులు దోషిగా తేలిన సాగర్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు.

ఉమ్మడి జిల్లా చరిత్రలో ఇది ఐదో తీర్పు

ఉమ్మడి వరంగల్ జిల్లా న్యాయ వ్యవస్థలో మరణ దండన తీర్పు వెలువడడం ఇది ఐదోసారి. ఇందులో రెండు కేసుల్లో దోషులు పై కోర్టులకు వెళ్లి ఉరిశిక్షను యావజ్జీవ శిక్షగా మార్చుకున్నారు.

9 మంది హత్య కేసులో..



2020, మే 20న గ్రేటర్ వరంగల్ పరిధి గొర్రెకుంటలోని గోనె సంచుల తయారీ యూనిట్‌లో బిహార్‌కు చెందిన సంజయ్‌కుమార్ యాదవ్ అనే వ్యక్తి మిల్లులో పనిచేసే ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు, డ్రైవర్, తయారీ యూనిట్‌లో నివసిస్తున్న ఇద్దరు వ్యక్తులు తినే ఆహారంలో నిద్రమాత్రలు కలిపి, నిద్రించిన తర్వాత గొంతుకోసి హత్య చేశాడు. మృతదేహాలను సమీప బావిలో పడేశాడు. ఈ ఘటన మరుసటి రోజు వెలుగు చూసింది. ఈ కేసులో దోషిగా తేలిన సంజయ్‌కుమార్ యాదవ్‌కు వరంగల్ మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు అదే ఏడాది అక్టోబర్ 28న మరణ శిక్ష విధించింది. సంచలనం సృష్టించిన ఈ హత్య కేసులో కోర్టు వంద మంది సాక్ష్యులను విచారించింది.

పూర్వపు వరంగల్ జిల్లాలోనూ..

- కొన్నేళ్ల క్రితం నర్సంపేట డివిజన్ చెన్నారావుపేట మండలం జల్లిలో తొగరు సుదర్శన్‌రెడ్డి హత్యకు గురయ్యాడు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా పేర్కొన్న ఆర్.కొమ్మాల్, వంగపండ్ల అయిలయ్య, అంబాల కుమారస్వామితోపాటు మరొకరికి ఉరిశిక్ష విధిస్తూ తీర్పు వెలువడింది. అప్పటి ఎంసీపీఐ నేత మద్దికాయల ఓంకార్ ఉరిశిక్ష పడిన వారి పక్షాన హైకోర్టు తలుపు తట్టగా ఆ ఉరిశిక్షను యావజ్జీవ శిక్షగా మార్చారు.
- 2004లో స్టేషన్‌ఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన హత్యా నేరం కేసులో ముద్దాయిలకు నాటి మూడో అదనపు జిల్లా కోర్టు జడ్జి మోహన్‌గాంధీ ఉరిశిక్ష విధించారు. నష్కల్‌కు చెందిన మాధవరెడ్డి తన భార్యను వరకట్నం కోసం వేధించడమే కాకుండా హత్య చేశాడన్న ఆరోపణలపై ఉరిశిక్ష పడింది. కాగా.. అతను సుప్రీంకోర్టు వరకు వెళ్లడంతో యావజ్జీవ కారాగార శిక్షగా మార్చింది.

తొమ్మిది నెలల చిన్నారిపై అత్యాచారం, హత్యకేసులో..



2019, జూన్ 18వ తేదీ అర్ధరాత్రి హనుమకొండలో డాబాపై నిద్రిస్తున్న తొమ్మిది నెలల చిన్నారిని ప్రవీణ్ అనే వ్యక్తి ఎత్తుకెళ్లి అత్యాచారం జరిపి హత్య చేశాడు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి ఐపీసీ సెక్షన్ 449, 379, 376, 376(ఏబీ) బాలికలపై అత్యాచారాల నిరోధక చట్టం సెక్షన్ 5అండ్ 6, ఐపీసీ సెక్షన్ 302 హత్యానేరం కింద కేసు నమోదు చేశారు. 20 రోజుల్లోనే కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన వరంగల్ మొదటి అదనపు జిల్లా కోర్టు 30 మందికిపైనే సాక్ష్యులను విచారించింది. ప్రవీణ్‌పై నేరం రుజువు కావడంతో ఐపీసీ సెక్షన్ 302 హత్యానేరం కింద మరణశిక్ష విధిస్తూ జడ్జి జయకుమార్ 2019 ఆగస్టు 8వ తేదీన సంచలన తీర్పునిచ్చారు. కోర్టు 49 రోజుల్లో తీర్పు వెలువరించింది.

బీఆర్‌ఎస్‌ను మళ్లీ గెలిపించాలి

పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



పులిగిల్లలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

నడికూడ: పేదలకు అండగా నిలుస్తున్న బీఆర్‌ఎస్‌ను మళ్లీ గెలిపించాలని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటేశ్వర్లపల్లి, నార్లపూర్, చర్లపల్లి, పులిగిల్ల గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. వెంకటేశ్వర్లపల్లిలో రూ.4.10 కోట్లతో వెంకటేశ్వర్లపల్లి నుంచి నార్లపూర్, మర్రిపల్లిగూడెం, నర్సింగపురం వరకు బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. నార్లపూర్ నుంచి పరకాల వరకు రూ.25 కోట్లతో బీటీ రోడ్డు, నార్లపూర్ పెద్దవాగుపై రూ.18.52 కోట్లతో చెక్ డ్యామ్ పనులకు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. చర్లపల్లిలో రూ.18.52 కోట్లతో చర్లపల్లి నుంచి మరిపల్లిగూడెం వరకు రోడ్డు, బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన, పల్లె దవాఖానా, మహిళా భవనాన్ని ప్రారంభించారు. పులిగిల్లలో రూ.2.90 కోట్లతో పులిగిల్ల నుంచి చౌటుపర్తి వరకు బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు.

సంక్షేమమే సీఎం కేసీఆర్ ఎజెండా

ఈసందర్భంగా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల సంక్షేమమే సీఎం కేసీఆర్ ఎజెండా అని, కాంగ్రెస్ పార్టీవి ఆచరణ సాధ్యం కాని హామీలు, ఆపార్టీకే తెలంగాణలో గ్యారెంటీ లేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదో ప్రజలకు చెప్పాలని సవాల్ విసిరారు. అర్హులందరికీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అన్ని వర్గాల ప్రజలకు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో గత పాలకులు చేయని అభివృద్ధి చేస్తుంటే, ప్రతిపక్ష నాయకులు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. వెంకటేశ్వర్లపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ మచ్చ అనసూర్య, జెడ్పీటీసీ కోడెపాక సుమలత, వైస్ ఎంపీపీ చంద కుమారస్వామి, సర్పంచ్‌లు, మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి, గణపతిరెడ్డి, జయపాల్‌రెడ్డి, గోల్కొండ సదానందం, అనిల్, పోచంపల్లి రఘుపతి, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవోదయ విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్

కరీమాబాద్ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని మామునూరు నవోదయ విద్యాలయాన్ని కలెక్టర్, మేనేజ్‌మెంట్ కమిటీ చైర్‌పర్సన్ ప్రావీణ్య శుక్రవారం సందర్శించారు. విద్యాలయంలోని అన్ని విభాగాలు, వసతులను పరిశీలించారు. 12వ తరగతి విద్యార్థినీ విద్యార్థులతో పాఠ్యాంశాలకు సంబంధించిన విషయాలు, బోధన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈక్రమంలోనే విద్యాలయ కమిటీతో సమావేశం నిర్వహించి విద్యార్థులకు బోధన, సౌకర్యాలు, కావాల్సిన వసతుల గురించి చర్చించారు. అవసరమైన వాటిని మంజూరు చేసేందుకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈఓ వాసంతి, ప్రిన్సిపాల్ పూర్ణిమ, ఈఈ నరేందర్‌రెడ్డి, డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ అనిల్‌కుమార్, ప్రొఫెసర్ ఆంజనేయులు, అంజిరెడ్డి, రమేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ముల్కనూరు సొసైటీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల



ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ముల్కనూరు సొసైటీలో 5 డైరెక్టర్ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్‌ను డిప్యూటీ రిజిస్ట్రార్ యం.నీరజ శుక్రవారం విడుదల చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. 4, 6, 10, 11, 13 నియోజకవర్గాల్లో డైరెక్టర్ స్థానాలు ఖాళీ అయినందున అక్టోబర్ 30న ఎన్నికలు జరుపనున్నట్లు ఆమె వెల్లడించారు. అక్టోబర్ 16న నామినేషన్లు, 17న పరిశీలన, 18న ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు, 30న ఎన్నికలు, 31న నూతన డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఓటు వేసే అర్హత ఉన్న సభ్యుల జాబితా సంఘం నోటీస్ బోర్డులో ఉంటుందని ఆమె తెలిపారు. రహస్య ఓటింగ్ ద్వారా ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈసమావేశంలో బ్యాంక్ జీఎం రామ్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవీందర్, దేవేందర్‌రెడ్డి, రాజమౌళి తదితరులు ఉన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

హన్మకొండ కల్చరల్: వరంగల్ జిల్లా రంగస్థల, పద్యనాటక కళా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఉదయం 10 గంటలకు వరంగల్ పోతన విజ్ఞాన పీఠం ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్షుడు మారేడోజు సదానందచారి, ప్రధాన కార్యదర్శి దండు సారంగపాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్ అతిథులుగా పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. కళాకారుల సూచనలతో పరిషత్ భవిష్యత్ కార్యక్రమాలపై చర్చ జరుగుతుందని వారు తెలిపారు.

పర్యాటక రంగానికి పెద్దపీట



బోటులో షికారు చేస్తున్న వినయ్‌భాస్కర్, బండా ప్రకాశ్, సుందర్‌రాజ్ యాదవ్ తదితరులు

హన్మకొండ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ పర్యాటక రంగానికి పెద్ద పీట వేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ భద్రకాళి ట్యాంక్ బండ్ వద్ద శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ బోటింగ్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం భద్రకాళి చెరువులో జల విహారం చేశారు. ఈసందర్భంగా చీఫ్‌విప్ వినయ్ మాట్లాడుతూ.. భద్రకాళి చెరువు మధ్యలో ధ్యాన మందిరాన్ని ఏర్పాటు చేయాలని పర్యాటక శాఖ అధికారులకు సూచించారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చాకే పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యం దక్కిందన్నారు. వరదల సమయంలో విశేష కృషి చేసిన పర్యాటక సిబ్బందిని అతిథులు అభినందించారు. పర్యాటక దినోత్సవ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో 'కుడా' చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, అధికారులు, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



బోడగుట్ట వద్ద ట్రెక్కింగ్ ప్రారంభిస్తున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, కలెక్టర్ సిక్తా పట్నాయక్

ట్రెక్కింగ్, క్లైంబింగ్ యూనిట్ ప్రారంభం

కాజీపేట రూరల్: బోడగుట్ట వద్ద ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్, జిల్లా అధికారులతో కలిసి ట్రెక్కింగ్, రాక్ క్లైంబింగ్ యూనిట్‌ను చీఫ్ విప్ వినయ్‌భాస్కర్ ప్రారంభించారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ జిల్లా అధికారి శివాజీ, మౌంట్ ఎవరెస్ట్ శిఖరం అధిరోహించిన ఆనంద్, అన్విత, అఖిల్, రాకేశ్, కాజీపేట తహసీల్దార్ భావ్‌సింగ్, కార్పొరేటర్ సంకు నర్సింగరావు తదితరులున్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

- అరసం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బ్రహ్మచారి నిధి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

హన్మకొండ: అభ్యుదయ రచయితల సంఘం తెలంగాణ రాష్ట్ర తృతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మచారి నిధి, ఉపాధ్యక్షుడు శంకర్ నారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండలోని కాళోజీ విగ్రహం వద్ద రాష్ట్ర మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా శంకర్ నారాయణ మాట్లాడుతూ.. అక్టోబర్ 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లో అరసం తృతీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభల్లో నవచేతన పబ్లిషింగ్ హౌస్ ఎటుకూరి ప్రసాద్, సీనియర్ సంపాదకుడు కే.శ్రీనివాస్, సాహితీ ప్రముఖులు జూలూరి గౌరి శంకర్, మామిడి హరికృష్ణ, నందిని సిధారెడ్డి, తెలకపల్లి రవి, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి సందేశాలు ఉంటాయని వివరించారు. సృజనకారులు– పాలకులు– వ్యవస్థ, తెలంగాణ సాయుధ పోరాటం, తెలంగాణ సాధనలో తొలి, మలి దశ ఉద్యమ సాహిత్యం, ఈ దశాబ్ది సాహిత్యం అనే అంశాలపై సదస్సు నిర్వహిస్తున్నట్లు వివరించారు. డాక్టర్ పల్లేరు వీరాస్వామి, రామబ్రహ్మం, వెంగళరెడ్డి, కె.చంద్రమౌళి, భిక్షపతి పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థికి ఎంబీబీఎస్ సీటు

- ఫీజు కట్టలేక సీటు కోల్పోనున్న వైనం



భరద్వాజ్

మడికొండ: సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల వర్ధన్నపేట(మడికొండ బాలుర) కాలేజీలో బైపీసీ చదివిన సుదగాని భరద్వాజ్ నీట్–2023లో ప్రతిభ కనబరిచి మేడ్చల్‌లోని అరుంధతి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. కానీ, కూలీపనుల చేసుకునే ఆయన తల్లిదండ్రులు ఫీజుకట్టలేని పరిస్థితి నెలకొంది. భరద్వాజ్ చదువుకు సంవత్సరానికి రూ.3లక్షల చొప్పున నాలుగు సంవత్సరాలకు గాను రూ.12లక్షలు అవసరం. కానీ, ఖర్చు భరించలేని తల్లిదండ్రులు, కుమారుడి చదువుకు ఎవరైన దాతలు సాయం చేయాలని వేడుకుంటున్నారు. ఎంబీబీఎస్ సీటు పొందిన భరద్వాజ్‌కు దాతలు సాయం చేయాలని ప్రిన్సిపాల్ ఖుర్షీద్ కోరుతున్నారు. దాతలు 93984 22230, 76809 06134 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆత్మహత్య

టేకుమట్ల: భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన జయశంకర భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని దుబ్యాలలో శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... దుబ్యాలకు చెందిన మొగిళిపాక కుమారస్వామి(45) భార్య 10 సంవత్సరాల క్రితం కుటుంబ కలహాలతో అతని నుంచి దూరంగా ఉంటుంది. ఆమెను ఎన్నిసార్లు కాపురానికి రావాలని కోరినా రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 23న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జమ్మికుంట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు.

మో'డల్' మార్కెట్

కూరగాయల మార్కెట్‌లో మౌలిక వసతుల కొరత

- పశువుల స్వైర విహారం
- ప్రతిపాదనల్లోనే క్యాటిల్ ట్రాప్స్ నిర్మాణం
- డ్రెయినేజీ వ్యవస్థను విస్మరించిన అధికారులు
- ఇబ్బందుల్లో రైతులు, వ్యాపారులు, వినియోగదారులు



మార్కెట్‌లో పశువుల స్వైర విహారం



బహిరంగ ప్రదేశంలో పారబోసిన కుళ్లిన కూరగాయలు

వరంగల్: మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో లక్ష్మీపురంలో సుమారు రూ.7కోట్ల వ్యయంతో నిర్మించిన మోడల్ కూరగాయల మార్కెట్‌లో మౌలిక వసతులు లేకుండా పోయాయి. మార్కెట్ నిర్మాణంలో ఇంజనీర్లు డ్రెయినేజీ వ్యవస్థను పూర్తిగా విస్మరించారు. దీంతో నీరు బయటకు వెళ్లే మార్గాలు లేక చిన్నపాటి వర్షానికే మార్కెట్ మొత్తం బురదమయంగా మారుతోంది. నిత్యం సుమారు ఐదు వేల మంది రైతులు, వ్యాపారులు, వినియోగదారులు మార్కెట్‌లో కూరగాయల క్రయ, విక్రయాల కోసం వస్తుంటారు. కానీ, బురదకారణంగా చిన్నపాటి వర్షం కురిసినా.. మార్కెట్‌కు వినియోగదారులు రావాలంటే జంకుతున్నారు. మార్కెట్‌లో డ్రెయినేజీ వ్యవస్థను నిర్మించాలని మార్కెటింగ్ అధికారులు, జిల్లా కలెక్టర్‌కు వర్తకులు వినతి పత్రాలు అందించినా ఫలితం లేకుండా పోయింది.

పశువుల స్వైర విహారం

మోడల్ కూరగాయల మార్కెట్‌కు 5గేట్లు పెట్టిన ఇంజనీరింగ్ అధికారులు లోపలకు పశువులు రాకుండా క్యాటిల్ ట్రాప్‌లను నిర్మించకపోవడం గమనార్హం. మార్కెట్‌లోని చిల్లర వ్యాపారులు ఉదయం వేళలో తాజా కూరగాయలు విక్రయించిన అనంతరం నాణ్యతలేని, కుళ్లిపోయిన కూరగాయలను మార్కెట్ గేట్ల వద్ద, రోడ్లపై పారబోస్తుండంతో వాటిని తినేందుకు మార్కెట్‌లోకి పశువులు వస్తున్నాయి.

దాడులు నిత్యకృత్యం !

కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు, వినియోగదారులపై పశువులు దాడి చేయడం నిత్యకృత్యంగా మారింది. గతంలో పశువులు హమాలీ నాయకుడిపై దాడి చేయడంతో ఆస్పత్రి పాలయ్యారు. ఓ వ్యాపారిపై దాడి చేయడంతో చేయి విరిగిపోయింది. అప్పుడు మార్కెట్ అధికారులు పశువులను బంధించి యాజమానులను పిలిపించి హెచ్చరించి వదిలేశారు. కానీ, తర్వాత పశువులు మళ్లీ మార్కెట్‌లోకి యథేచ్ఛగా వస్తున్నాయి.

డ్రెయినేజీ నిర్మించాలి



కూరగాయల మార్కెట్‌లో డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వర్షం పడినప్పుడు నీరు బయటకు వెళ్లే మార్గం లేక బురదమయంగా మారుతోంది. అధికారులు వెంటనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలి.

– జారతి శ్రీనివాస్, అధ్యక్షుడు వర్తకసంఘం

క్యాటిల్ ట్రాప్‌లు ఉండాలి..



ప్రభుత్వ కార్యాలయాల ఎదుట పశువులు లోపలికి రాకుండా నిర్మించిన విధంగా క్యాటిల్ ట్రాప్‌లు నిర్మించాలి. కూరగాయల మార్కెట్‌లో ఐదు గేట్లు ఏర్పాటు చేసి మార్కెటింగ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు ఆ గేట్ల ఎదుట క్యాటిల్ ట్రాప్స్‌ను పెట్టకపోవడం వల్ల పశువులు యథేచ్ఛగా వస్తున్నాయి. వెంటనే పశువులు రాకుండా చర్యలు తీసుకోవాలి.

– బూరుగుల శ్రీనివాస్, వ్యాపారి

ఒత్తిడి, ఒంటరితనం, కుంగుబాటుతోనూ కేన్సర్

- డాక్టర్ కత్తుల సతీష్



మాట్లాడుతున్న డాక్టర్ సతీష్

ఎంజీఎం : ధూమపానం, మద్యపానమే కాకుండా ఒంటరితనం, కుంగుబాటు, నిద్రలేమి వంటివి కూడా కేన్సర్ వచ్చేందుకు కారణమవుతాయని ప్రముఖ డాక్టర్ కత్తుల సతీష్, ఎండీ, క్లినిక్ ప్రొఫెసర్ తెలిపారు. అమెరికాలో అంకాలజిస్టుగా పనిచేస్తున్న డాక్టర్ సతీష్ ఇటీవల అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్ (ఏపీపీఐ) అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు వరంగల్‌కు వచ్చిన ఆయన శుక్రవారం నగరంలో రత్నా హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మొక్కల ఆధారిత అహారం, శారీరక శ్రమ, పునరుద్ధరణ నిద్ర, ఒత్తిడి నిర్వహణ, మద్యపానానికి దూరం ఉండటం, సానుకూల సామాజిక సంబంధాలు కలిగి ఉండటంపై ఆధారపడి మనుషుల జీవనశైలి మార్పు ఉంటుందని తెలిపారు. ప్రాసెస్డ్ మాంసం కూడా కేన్సర్‌కు పెద్ద ప్రమాదకరమని తెలిపారు. రొమ్ము, ప్రొస్టేట్, మైలోమా వంటి కేన్సర్ రోగుల్లో అధిక బరువు కారణంగా మరణాలు పెరుగుతాయని, శారీరక శ్రమ లేకపోవడం వంటి వాటితో కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందని స్పష్టమైందని తెలిపారు. వ్యాయామం, నడక, జాగింగ్, స్విమ్మింగ్ తదితర వాటిపై దృష్టి సారించాలని అయన సూచించారు.

ఆలేరు చెరువులో చేపల మృత్యువాత

- ఇప్పటికే సుమారు రూ.30లక్షల నష్టం
- ఆందోళనలో మత్స్యకారులు



మృతిచెందిన చేపలను చూపిస్తున్న మత్స్యకారులు

నెల్లికుదురు: అంతుచిక్కని వ్యాధితో చెరువులోని చేపలన్నీ చనిపోయి రూ.30లక్షల నష్టం వాటిల్లిందని మానుకోట జిల్లా నెల్లికుదురు మండలంలోని ఆలేరు గ్రామ మత్స్యకారులు, ముదిరాజ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముదిరాజ్ సొసైటీ అధ్యక్షుడు బాద ఉప్పలయ్య, ఉపాధ్యక్షుడు శ్రీను, కార్యదర్శి సురేష్ శుక్రవారం మాట్లాడారు. గత 15 రోజుల నుంచి చేపలు మృత్యువాత పడుతున్నాయన్నారు. చిన్న, పెద్ద చేపలు చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత శాస్త్రవేత్తల సలహా మేరకు రూ.60వేలు వెచ్చించి లిక్విడ్‌ను చెరువులో కలిపినట్లు తెలిపారు. 250 ఎకరాల విస్తీర్ణం కలిగిన చెరువులో చేపలు చనిపోవడం ఆగడంలేదన్నారు. భారీ వర్షాలతో చెరువులోని చేపలు బయటకు వెళ్లిపోయాయని, మిగిలినవి ఇలా చనిపోతున్నాయని వాపోయారు. మళ్లీ చేప పిల్లలను వదిలినా బతుకుతాయనే నమ్మకం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి సంబంధిత అధికారులతో ఆలేరులోని చెరువును సందర్శించి, చేపల మృతిపై పరిశీలన చేయాలని కోరారు.

అర్చకులకు 'ఆగమ'పై శిక్షణ

- రేపటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ



సమావేశంలో పాల్గొన్న గంగు ఉపేంద్రశర్మ, సునీత, శేషుభారతి, వేదపండితులు

హన్మకొండ కల్చరల్ : రేపటి నుంచి ప్రారంభమయ్యే ఆగమ శిక్షణ శిబిరంలో డీడీఎన్ అర్చకులు పాల్గొని వినియోగించుకోవాలని తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్ర శర్మ తెలిపారు. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అక్టోబర్ ఒకటి నుంచి 3వ తేదీ వరకు మూడు రోజుల పాటు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా దూపదీపనైవేద్య (డీడీఎన్)అర్చకులకు శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లా అర్చకులకు హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గంగు ఉపేంద్రశర్మ, వరంగల్ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, భద్రకాళి దేవాలయం ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి, సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి రత్నాకర్, దేవాదాయశాఖ పర్యవేక్షకులు సాయిబాబా, విజయ్‌కుమార్, వేద పండితులతో కలిసి శుక్రవారం టీటీడీ కల్యాణ మండపంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. రామల సునీత మాట్లాడుతూ.. ప్రతి అర్చకుడు గ్రామీణప్రాంతాల్లో ఉన్న దేవాలయాల్లో పూజలు సక్రమంగా నిర్వహించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. శేషుభారతి మాట్లాడుతూ ప్రతి అర్చకుడు కోడ్ ఆఫ్ కండక్ట్ జుట్టు– బొట్టు– కట్టు పాటించాలని, అప్పుడే సంఘంలో గౌరవం పెరుగుతుందన్నారు. సమావేశంలో వేదపండితులు సంపత్‌కుమార్‌శర్మ, విజయకుమారాచార్యులు, శ్రీనివాసశర్మ, రవీందర్‌శర్మ, జాగర్లమూడి శ్రీరాం శర్మ, శ్రీనివాసస్వామి, సంతోష్ పాల్గొన్నారు.

ఓబీసీ సబ్ కోటా అమలు చేయాలి



మాట్లాడుతున్న నేదునూరి జ్యోతి

న్యూశాయంపేట: కేంద్రం ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లును స్వాగతిస్తున్నామని, అలాగే, ఓబీసీ సబ్ కోటాను కూడా అమలు చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి డిమాండ్ చేశారు. 'మహిళా రిజర్వేషన్ బిల్లు సవాళ్లు – పరిష్కార మార్గాలు' అనే అంశంపై హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రసమల్ల దీన అధ్యక్షతన శుక్రవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నేదునూరి జ్యోతి మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల సందర్భంగా లబ్ధి పొందాలనే కుటిల బుద్ధితో కేంద్రం మహిళా బిల్లును తీసుకొచ్చిందని ఆరోపించారు. చిత్తశుద్ధి ఉంటే వచ్చే పార్లమెంట్ ఎన్నికల లోపు మహిళా బిల్లును అమలు చేయాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మండ సదాలక్ష్మి, సీపీఐ జిల్లా కార్యదర్శి భిక్షపతి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

'చాంబర్' ప్లాటినం జూబ్లీ వేడుకలు

- నేడు ప్రారంభించనున్న మంత్రి నిరంజన్‌రెడ్డి



చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ కార్యాలయం

వరంగల్: వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ 75ఏళ్ల ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా చాంబర్ ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నారు. వరంగల్ లక్ష్మీపురంలోని చాంబర్ కార్యాలయం ఆవరణలో ఈ వేడుకలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి శనివారం సాయంత్రం 6గంటలకు ప్రారంభించనున్నారు.

చాంబర్ ప్రస్థానం..

వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ 1948 సెప్టెంబర్ 28వ తేదీన వరంగల్ బట్టల వర్తక సంఘంలో పురుడు పోసుకుంది. 50సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అధ్యక్షుడు టి.రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్‌సోనిల నేతృత్వంలో 1998 అక్టోబర్ 11న గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించారు. చాంబర్ కార్యకలాపాలు 1999 నుంచి పూర్తిస్థాయిలో వెలుగులోకి వచ్చాయి. వరంగల్ లక్ష్మీపురంలోని పాత వ్యవసాయ మార్కెట్ లావాదేవీలకు ఇబ్బందికరంగా మారడంతో ఏనుమాములలో కొత్త మార్కెట్ సాధించడంలో చాంబర్ ఎంతో శ్రమించింది. వసతుల కల్పనకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని చాంబర్ ఆధ్వర్యంలో ఆరు రోజుల పాటు క్రయ, విక్రయాలను నిలిపివేసి నిరసనలు తెలిపారు. ఈక్రమంలో 1999 నవంబర్ 4న ఏనుమాములలో వ్యాపార లావాదేవీలు ప్రారంభం కావడంతో ఓ కొత్త అధ్యాయం మొదలైంది. వరంగల్ శివారు గొర్రెకుంట ఇండస్ట్రియల్ ఏరియాలోని రైస్, జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్.. ఫౌడర్ తయారీ వంటి ఎన్నో మిల్లులకు కరెంట్ కష్టాలు అధిగమించడానికి 1995–97లో ప్రత్యేక సబ్ స్టేషన్ ఏర్పాటు, 2003–05లో రైతుల ధాన్యం తూకాలు ఎలక్ట్రానిక్ కాంటాల ద్వారా జరపడానికి వ్యాపారులను ఒప్పించి అందుకు కావాల్సిన ఏర్పాట్లు చేసింది. 2004–06లో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్‌పై ఎస్పీడీసీఎల్ విధించిన లో పవర్ ఫ్యాక్టర్ సర్చార్జిని రద్దు చేసేందుకు పోరాటం చేసింది. 2010–11లో పత్తి నాణ్యతను ధ్రువీకరించడానికి కావాల్సిన కాటన్ టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటుకు చాంబర్ కృషి చేసింది. ప్రభుత్వం విధించిన మార్కెట్ ఫీజును ఉపసంహరించడంలో ప్రభుత్వ పెద్దలతో చర్చలు జరిపి తొలగింపులో చాంబర్ విజయం సాధించింది. 2018–21లో సుమారు 200మందికి కొత్త వ్యాపార లైసెన్సు ఇప్పించడంలో కృషి చేసింది. చాంబర్ అధ్యక్ష, కార్యదర్శులుగా వ్యవహరించిన బొమ్మినేని రవీందర్‌రెడ్డి, వేద ప్రకాశ్‌లతో పాటు దిడ్డి కుమారస్వామి, టి.రమేష్‌బాబు, సురేష్‌కుమార్ దాలియా, కంభంపాటి కుమారస్వామి, కటకం పెంటయ్య, తోట నర్సింహారావు, శ్యాంసుందర్ సోనీ తదితరులు ఎంతో కృషి చేశారు.

వ్యాపారులు, రైతుల సంక్షేమమే ధ్యేయంగా..



వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ పూర్తిగా వ్యాపారులు, రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తూ.. సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తుంది. రైతులు విక్రయించిన ఉత్పత్తులకు వెంటనే డబ్బులు చెల్లించేందుకు ఇండస్ట్రీ ఎంతో కృషి చేసింది. కార్మికులకు, వ్యాపారులకు అన్ని విధాలుగా అండగా ఉంటున్నాం. ప్లాటినం జూబ్లీ వేడుకలను ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం నిర్వహిస్తున్నాం.

– బొమ్మినేని రవీందర్‌రెడ్డి, అధ్యక్షుడు, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ

పార్ట్ టైం ఉద్యోగం ఇప్పిస్తామని..

- రూ.5.95 లక్షలు స్వాహా
- సైబర్ నేరగాళ్ల వలలో నిరుద్యోగి

గీసుకొండ : పార్ట్‌టైం ఉద్యోగం, మంచి వేతనం ఇప్పిస్తామని సైబర్ నేరగాళ్లు నమ్మబలికి ఓ నిరుద్యోగి నుంచి రూ.5,95,898 స్వాహా చేసిన ఘటన వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. గ్రేటర్ వరంగల్ పరిధిలోని జాన్‌పాకకు చెందిన మహ్మద్ ఆసిఫ్ అనే నిరుద్యోగ యువకుడికి వాట్సాప్ ద్వారా ఇటీవల పార్ట్‌టైం ఉద్యోగం ఇప్పిస్తామంటూ మెసేజ్ వచ్చింది. ఉద్యోగం చేయాలంటే పది టాస్కులు పూర్తి చేయాలని, తాము కోరిన మేర డబ్బులు పంపిస్తే మళ్లీ వస్తాయని నమ్మబలికారు. రెండు టాస్కులు పూర్తి చేసిన తర్వాత అతడికి కొంత డబ్బు పంపించారు. ఇలా ఆయన తన ఎయిర్‌టెల్ బ్యాంకు, ఇండియన్ బ్యాంకు అకౌంట్ల ద్వారా పలుమార్లు మొత్తం రూ.5,95,898 పంపించాడు. తర్వాత అకౌంట్ ఫ్రీజ్ అయ్యిందని బుకాయించారు. వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. మోసపోయాయనని గ్రహించిన ఆసిఫ్ ఈనెల 7న సైబర్ క్రైంలో ఫిర్యాదు చేశాడు. తాను కోల్పోయిన డబ్బును తిరిగి ఇప్పించి న్యాయం చేయాలని బాధితుడు ఆసిఫ్ కోరాడు.

నలుగురు డైరెక్టర్ల ఎన్నిక



ఎన్నికైన డైరెక్టర్లతో సంబురాల్లో న్యాయవాదులు

వరంగల్ లీగల్: జిల్లా న్యాయవాదుల సహకార సంఘంలోని నాలుగు డైరెక్టర్ల స్థానాలకు జరిగిన ఎన్నికల ఫలితాలను శుక్రవారం సాయంత్రం ఎన్నికల కమిటీ ప్రకటించింది. నాలుగు స్థానాలకు తొమ్మిది మంది పోటీ పడగా.. అత్యధిక ఓట్లు సాధించిన మొదటి నలుగురు రాయబారపు భిక్షపతి (385 ఓట్లు), యు.కృష్ణారావు (311), చెన్నూరి రమేశ్ (305), సిద్ధం యుగేందర్ (278) ఓట్లతో విజేతలుగా నిలిచినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఈ పోలింగ్‌లో మొత్తం 1,250 ఓట్లకు గాను 594 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు వివరించారు. ఎన్నికల నిర్వహణ కమిటీగా సీనియర్ న్యాయవాది ప్రేమ్‌సాగర్, చిదంబర్‌నాథ్, రాజారాంరెడ్డి, నాగేంద్ర వ్యవహరించారు.

నగరంలో క్షుద్ర పూజల కలకలం

- కేయూ– ఎస్సారెస్పీ మధ్య ఘటన
- పోలీసుల అదుపులో ఇద్దరు యువకులు
- వారం క్రితమే కేయూ పోతన హాస్టల్ వెనుక కూడా..



క్షుద్రపూజలు చేసిన ప్రదేశం

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ – ఎస్సారెస్పీ కాల్వ పక్కన ఓ చెట్టు వద్ద శుక్రవారం క్షుద్రపూజల ఆనవాళ్లు స్థానికులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వివరాలిలా ఉన్నాయి.. ఎస్సారెస్పీ కాల్వ కట్ట సమీపంలో పొదల మధ్య ఓ చెట్టు వద్ద మేక, కోడిని బలిచ్చిన ఆనవాళ్లతోపాటు నిమ్మకాయలు, పసుపు కుంకుమలు ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. దీంతో ఎస్సై రాజ్‌కుమార్ తన సిబ్బందితో సంఘటనస్థలాన్ని చేరుకుని విచారణ చేపట్టారు. కాగా, క్షుద్రపూజలు చేస్తున్నట్లు అనుమానంతో ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారణ ప్రారంభించారు. క్షుద్రపూజలతో తమకు ఎలాంటి సంబంధం లేదని యువకులు చెప్పినట్లు సమాచారం. అదుపులో ఉన్న యువకులు నర్సంపేటకు చెందిన వారిగా తెలిసింది. ఇదిలా ఉండగా.. ఇటీవల కాకతీయ యూనివర్సిటీ పోతన హాస్టల్ వెనుక వైపు క్షుదపూజలు జరిగాయి. అక్కడ కూడా నిమ్మకాయలు, పసుపు, కుంకుమలను గుర్తించారు. ఈవిషయం యూనివర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు అందింది. అయితే క్షుద్రపూజలు నేర్చుకోవడానికి ఆ ఇద్దరు యువకులు ఈ వ్యవహారానికి పాల్పడినట్లు సమాచారం. ఆ ఇద్దరు వ్యక్తులతో ఓ తాంత్రికుడు ఉన్నట్లు తెలిసింది. అయితే ఆ ఇద్దరు యువకులు తిరిగి క్షుద్ర పూజలు చేసిన ప్రదేశానికి వచ్చి పట్టుబడినట్లు తెలిసింది. ఇటీవల పోతన హాస్టల్ పక్కన కూడా వీరే క్షుద్ర పూజలు చేసినట్లు సమాచారం.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య
- టెమ్రిస్ ఉమ్మడి జిల్లాస్థాయి 2వ జోష్ క్రీడోత్సవాలు ప్రారంభం



క్రీడోత్సవాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, తదితరులు

న్యూశాయంపేట: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. శుక్రవారం వరంగల్ దూపకుంట రోడ్ శంభునిపేట మైనార్టీ గురుకులంలో తెలంగాణ మైనార్టీ గురుకులాల విద్యాసంస్థల(టెమ్రిస్) రెండు రోజుల ఉమ్మడి జిల్లాస్థాయి బాలికల(2వ జోష్)క్రీడోత్సవాలను కలెక్టర్ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ నీలిమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. వరంగల్ డిప్యూటీ మేయర్ రిజ్వాన షమీమ్ మాట్లాడుతూ ఉన్నత స్థాయికి ఎదిగిన క్రీడాకారులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, హ్యాండ్‌బాల్, చెస్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 8 బాలికల మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల విద్యార్థినులు, టెమ్రిస్ డిప్యూటీ సెక్రటరీ కృష్ణకుమార్, డీఎండబ్ల్యూ హరికృష్ణ, ఆర్ఎల్‌సీలు శ్రీపాల, శ్రీనివాస్, విజిలెన్స్ అధికారులు మక్బూల్‌పాష, అంజద్‌అలీ, అకాడమిక్ కో–ఆర్డినేటర్ రూహీనా, ప్రిన్సిపాళ్లు నీరజ, కృష్ణకుమారి, మాధవీలత, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

జక్కలొద్ది బాలుర గురుకులంలో..

వరంగల్ రంగశాయిపేట శివారు జక్కలొద్ది మైనార్టీ గురుకులంలో టెమ్రిస్ బాలుర ఉమ్మడి జిల్లాస్థాయి 2వ జోష్ క్రీడోత్సవాలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర మైనార్టీ కమిషన్ మెంబర్ దర్శన్ సింగ్, రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్‌లు క్రీడోత్సవాలను ప్రారంభించారు. 8బాలుర మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల విద్యార్థులు ఖోఖో, వాలీబాల్, కబడ్డీ హ్యాండ్‌బాల్, టెన్నికాయిట్ చెస్, అథ్లెటిక్స్‌లో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ భిక్షపతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డీఐఓ కృష్ణకుమార్, ఆర్ఎల్‌సీ–2 శ్రీనివాస్ విజిలెన్స్ అధికారి సయ్యద్ అక్బర్, గురుకులాల ప్రిన్సిపాళ్ల సతీష్, శ్రీలత, అతియా, అనిల్‌బాబు, కుమార్, ఆబిద్, కౌన్సిలర్ సర్వర్ ఘాజీ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కావాలనుకున్నాడు..

- పిడుగుపాటుతో యువకుడి మృతి



పవన్‌కల్యాణ్ (ఫైల్)

మంగపేట: కానిస్టేబుల్ కావాలని కలలుకన్న ఓ యువకుడిని పిడుగుపాటు మృత్యు ఒడిలోకి చేర్చింది. ములుగు జిల్లా మంగపేట మండలంలోని కొత్తూరు మొట్లగూడెం పంచాయతీ పరిధిలోని బొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన ఈసం పవన్‌కల్యాణ్ (24) గురువారం అర్ధరాత్రి పిడుగు పాటుతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పవన్ కల్యాణ్ తన అన్న సాగుచేసిన మొక్కజొన్న చేను వద్దకు గురువారం రాత్రి కాపలాకు వెళ్లాడు. రాత్రి సుమారు 1.20 గంటల సమయంలో భారీ వర్షం కురియడంతో ఇంటికి వచ్చే క్రమంలో పిడుగు పడటంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఉదయం గ్రామానికి చెందిన ఓవ్యక్తి రోడ్డు పక్కన విగత జీవిగా పడిఉన్న పవన్‌కల్యాణ్‌ను గుర్తించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై రవికుమార్ సందర్శించి పంచానామా నిర్వహించారు. ఇదిలా ఉండగా.. మృతుడి తండ్రి ఈసం లక్ష్మయ్య రెండేళ్ల క్రితం, తల్లి సమ్మక్క సంవత్సరం క్రితం మృతి చెందారు. అప్పటి నుంచి పవన్ తన అన్న శ్యామ్‌ప్రసాద్ వద్ద ఉంటున్నాడు. పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ నియామకానికి పవన్‌కల్యాణ్ హనుమకొండలో హాస్టల్‌లో ఉంటూ శిక్షణ పొందుతున్నాడు. వారం రోజుల క్రితం ఇంటికి వచ్చిన మృతుడు తన అన్న చేను వద్దకు కాపలా కోసం వెళ్లి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేక పోతున్నారు. కానిస్టేబుల్ ఉద్యోగం కోసం ఎంతో శ్రమించాడని, పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాడని, కొలువు రాక ముందే మృతి చెందాడని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.